క్లుప్తంగా

డయేరియా నిర్మూలనకు కృషి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యాధికారి శివకుమార్

కడెం: డయేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ప్రభుత్వ వైద్యాధికారి శివకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు, సబ్ సెంటర్‌లో డయేరియా కార్నర్‌లను సోమవారం ప్రారంభించి పలువురికి ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. హెచ్ఈవో వేణుగోపాల్, సూపర్‌వైజర్ నిర్మల, హెల్త్ అసిస్టెంట్లు నర్సయ్య, కొమురయ్య ఉన్నారు.

నిర్మల్ నుంచి పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు

నిర్మల్‌టౌన్: ప్రయాణికుల కోరిక మేరకు నిర్మల్‌రూరల్ మండలం అనంతపేట్, నీలాయిపేట్, మేడిపల్లి బూరుగుపల్లి, మొండిగుట్ట, తాంద్ర గ్రామాలకు నిర్మల్ నుంచి పల్లె వెలుగు బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పండరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు నిర్మల్ నుంచి ఉదయం 7.20 గంటలకు బయల్దేరి 8.05 గంటలకు తాంద్రకు చేరుకుంటుందన్నారు. తిరిగి 8.20కు బయల్దేరి 9.05 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని పేర్కొన్నారు. మళ్లీ సాయంత్రం నిర్మల్ నుంచి 4.50 గంటలకు తాంద్రకు వెళ్తుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



రాచాపూర్‌లో మొక్కలు అందజేస్తున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి(కే) గ్రామాల్లో సోమవారం ఇంటింటికీ పండ్లు, పూలు, ఔషధ మొక్కలు 6 చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎంపీవో అమీర్ ఖాన్, టీఏ దినేశ్, పంచాయతీ కార్యదర్శులు శైలజ, ప్రియాంకరెడ్డి, ఎఫ్ఏ శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బస్సును సద్వినియోగం చేసుకోవాలి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఖానాపూర్ వాసులు

ఖానాపూర్: ఖానాపూర్–హైదరాబాద్ వెళ్లే మెట్‌పల్లి డిపో బస్సును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజు కోరారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నుంచి ఉదయం 5.30 గంటలకు బస్సు బయల్దేరి 11.30 గంటలకు హైదరాబాద్ చేరుతుందని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల ఇతర సమస్యలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ కామోజీ శ్రీనివాస్, స్థానిక యువకుడు సాయి కృష్ణ తదితరులు బస్సును నిరంతరం కొనసాగించాలని కోరుతూ డీఎంకు వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టే ప్రైవేట్ వాహనాలను నిరోధించాలని కోరుతూ డీఎం దేవరాజ్ అనంతరం ఖానాపూర్ ఎస్సైని కలిసి విన్నవించారు.

ఆక్రమణలు తొలగించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుభీర్: కుభీర్ ప్రాథమిక ఆసుపత్రి వద్ద మురుగుకాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని సోమవారం విఠలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఫిర్యాదుల విభాగంలో ఎంపీడీవో సాగర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు తీర్పునిచ్చిందని ఆ కాపీని చూపెట్టారు. ఏటా వర్షాకాలంలో వర్షపు నీరు, మురుగునీరు ప్రాథమిక ఆసుపత్రి, విఠలేశ్వర ఆలయంలోకి చేరుతుందని ఆయన దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ పెంటాజీ, కమిటీ సభ్యులు సూది రాజన్న, శ్రీకర్, దేవన్న, జీవన్ తదితరులు ఉన్నారు.

కూలీల కొరత..యంత్రాల బాట

- ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న రైతులు
- యంత్రాలతోనే విత్తనాలు
- కొంతమేర తీరిన ఇబ్బంది
- ముమ్మరంగా సాగుతున్న పనులు



ధర్మోరలో యంత్రంలో పసుపును విత్తుతున్న రైతులు

లోకేశ్వరం: పసుపు, సోయా, మొక్కజొన్న సాగుకు కూలీల కొరత ఏర్పడింది. దీంతో సాగుకు అవసరమైన మేర కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా యాంత్రీకరణ సదుపాయం అందుబాటులోకి రావడంతో వాటి వైపు రైతులు చూస్తున్నారు. విత్తనం వేసే యంత్రాలు రావడంతో వాటితో పనికానిచ్చేస్తున్నారు. పసుపు, మొక్కజొన్న, సోయా పంట సాగుకు వినియోగించుకుంటున్నారు. దీంతో యంత్రాలకు భలే డిమాండ్ పెరిగింది. జిల్లాలో సోయా, మొక్కజొన్న, పసుపు పంట అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ఈక్రమంలో కూలీల కొరత ఏర్పడుతోంది. అధిక ధరకు కూలీలను తీసుకురాలేక రైతులు యంత్రాలతో సాగు చేస్తున్నారు. ఒక్కో యంత్రం సామర్థ్యాన్ని బట్టి రోజుకు 5 నుంచి 15 ఎకరాల్లో విత్తనం చేస్తున్నారు. ట్రాక్టర్‌కు విత్తనం వేసే యంత్రాన్ని అమర్చి పసుపు మొక్కజొన్న, సోయా విత్తనం వేస్తున్నారు.

ఎరువులు సైతం యంత్రాలతోనే..

ఇంతకుముందు యంత్రాలు అందుబాటులో లేనందున ఎడ్ల అరకల సహాయంతో విత్తనాలు వేసేవారు. ఎడ్లతో విత్తనం వేయాలన్నా కూలీల అవసరం ఉండేది. ఎడ్ల అరకలు దొరకితే కూలీలు దొరక్కపోవడం, కూలీలు ఉంటే ఎడ్ల అరకలు దొరకని పరిస్థితి ఎదురవడంతో విత్తనం వేసుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. యంత్రాలతో సాగు చేయడంతో ఏమాత్రం కూలీల అవసరం ఉండదు. పసుపు, సోయా, మొక్కజొన్న విత్తనంతో పాటు రసాయన ఎరువులు సైతం యంత్రం ద్వారా భూమిలోకి చేరుతుంది. కూలీల కంటే ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు. అరకతో పసుపు విత్తనం వేస్తే ఎకరాకు రూ.6 వేలు ఖర్చవుతుంది. యంత్రం ద్వారా ఎకరాకు రూ.3 వేలు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. యంత్రం ద్వారా విత్తనం వేసుకోవడం ఎంతో సౌలభ్యంగా ఉందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు కలుగకుండా



ప్రతీసారి కూలీల సహాయంతో పసుపు విత్తనం వేస్తుండేవాడిని. ఈసారి యంత్రాలు అందుబాటులో ఉండడంతో ఎకరం పసుపు విత్తనం వేశాను. రైతు ఆలోచనలకు అనుగుణంగా యంత్రాలు రూపొందించారు. విత్తనంతోపాటు ఎరువులు వేసుకునే సదుపాయం ఉండడంతో సాగులో ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు.
– హన్మంత్‌రెడ్డి, రైతు

సమయానికి దొరకరు



మొక్కజొన్న, సోయా వేసేందుకు సమయానికి కూలీలు దొరకడం లేదు. ఎడ్ల అరకలు దొరకడం లేదు. దీంతో నానా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎంతో సౌకర్యం కలిగింది. పెద్ద రైతులకు అయితే మరింత ఉపయోగకరంగా ఉంది. యంత్రం సహాయంతో మూడెకరాల్లో సోయా సాగు చేశాను.
– మామిడి చిన్నారెడ్డి, రైతు

ఇబ్బందులు తీరాయి



ఖరీఫ్‌లో పంటలకు విత్తనం వేసుకునేందుకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం కూలీల కొరత ఉన్నందున యంత్రాలు రావడంతో రైతులు ఇబ్బందులు తీరాయి. పసుపుతోపాటు ఇతర పంటలను తీసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆధునీకరణ వైపు ఆసక్తి చూపారు.
– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

మత్తులో యువత

- గంజాయి, బోనోఫిక్స్ రెండు మిశ్రమంగా చేసి పీలుస్తూ..
- తాజాగా వెలుగుచూసిన బాటిల్‌షాట్ డబ్బాలు



అంబేద్కర్‌నగర్ శివారులో వెలుగుచూసిన బాటిల్‌షాట్ డబ్బా

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి కొంతదూరంలో గల సదర్మాట్ కాలువ పక్కన బాటిల్‌షాట్ డబ్బాలతో యువత గంజాయి తాగిన ఆనవాళ్లు సోమవారం వెలుగుచూశాయి. తరచూ గుట్కా, గంజాయి, సిగరేట్, గుడుంబా ఇలాంటివే కాకుండా కొత్త తరహాగా ఒక బాటిల్‌లో గంజాయి, బోనోఫిక్స్ రెండు మిశ్రమంగా చేసి పీలుస్తున్నారు. ఈ విషయం తెలిసినా కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో బోనోఫిక్స్ కలకలం మరువకముందే ఈ బాటిల్ షాట్ వ్యవహారం బయటపడడంతో పట్టణ యువత మత్తుతో చిత్తవుతూ పెడదారి పడుతున్నారనే తీరు ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. దీనిపై గతంలో ఎస్పీ గంజాయి రహిత జిల్లాగా మారుస్తానని హామీ ఇచ్చినా పట్టణంలో గంజాయి, మత్తు పదార్థాల ఆనవాళ్లు పోవడం లేదు. దానితోపాటు బాటిల్‌షాట్, బోనోఫిక్స్ అంటూ ఈ కొత్త మత్తు పదార్థాలకు యువత అలవాటు పడి పెడదారిన పడుతున్నారు.

విమాన ప్రమాదమృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న గల్ఫ్‌కార్మికులు

ఖానాపూర్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి ఆదివారం రాత్రి గల్ఫ్ కార్మికులు దుబాయ్‌లో నివాళులర్పించారు. దుబాయ్‌లోని జేబల్ అలీ క్యాంపు ఏరియాలో జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మికులు మౌనం పాటించారు. నాయకులు పెద్ది రవి, చంద్రశేఖర్, మూడారపు పవన్‌సాయి, సాగర్, రాములు, హరీశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాశీనాథ్ సేవలు అభినందనీయం



సన్మానిస్తున్న అన్నాబావు సాఠె కమిటీ సభ్యులు

భైంసాటౌన్: భైంసా ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ డా. కాశీనాథ్ సేవలు అభినందనీయమని అన్నాబావు సాఠె కమిటీ సభ్యులు అన్నారు. డా కాశీనాథ్ ఉత్తమ సేవలకుగాను సోమవారం అన్నాబావు సాఠె కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను శాలువాతో సన్మానించారు. అలాగే ముధోల్ ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌ను సైతం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో గంగాధర్, శంకర్, దుర్పత్‌బాయి, లక్ష్మణ్, చంద్రబాన్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీనగర్‌కాలనీ మున్నూరు కాపు సంఘ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మూడారపు పరమేశ్వర్, అధ్యక్షుడిగా సల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నాలం మదన్ మోహన్, కోశాధికారిగా గణేశ్, ఉపాధ్యక్షుడుగా గంట భూమేశ్, సలహా సభ్యులుగా పూసల పోశెట్టి, అనుముల భాస్కర్, సముందర్‌పల్లి రమేశ్, తదితరులు ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

గజమాలతో ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు ఆయన్ను గజమాలతోపాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి ప్రేమా అదరాభిమానాలు ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు.

శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలు

బాసర: చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలకు సరస్వతీ శిశుమందిరాలు నిలయాలు అని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిరం విద్యాలయ పునఃప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. శిశుమందిరాల్లో ప్రణాళికతో విద్యాబోధన జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తులు అందజేయాలి

నర్సాపూర్(జి): తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు అందజేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం 26 దరఖాస్తులు వచ్చినట్లు జూనియర్ అసిస్టెంట్ రాజు, రికార్డు అసిస్టెంట్ సాయన్న పేర్కొన్నారు.

తారు రోడ్డు వేయాలని డిమాండ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ నుంచి సోమవార్‌పేట్ మీదుగా తారు రోడ్డు వేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బాలికల పాఠశాల వద్ద కొనసాగుతున్న తారు రోడ్డు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. మున్సిపల్ అధికారులు త్వరలో తారు రోడ్డు వేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

రెవెన్యూ సదస్సులో 62 దరఖాస్తులు

ఖానాపూర్: బీర్నందిలో సోమవారం జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో 62 దరఖాస్తులు స్వీకరించామని తహసీల్దార్ సుజాత తెలిపారు. ఆర్ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

సోన్: రైతులతో దురుసుగా ప్రవర్తిస్తున్న తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కడ్తాల్ గ్రామ రైతులు ప్రజావాణిలో సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. భూ సమస్యలపై కార్యాలయానికి వెళ్తే నిరక్షరాస్యులైన తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవాలని ఎక్కువ మాట్లాడితే పట్టా భూములకు రెడ్‌మార్క్ చేస్తానని హెచ్చరిస్తున్నారని అన్నారు. లస్మరెడ్డి, రాంరెడ్డి, గంగాధర్, రాకేశ్, కె.గంగాధర్, రాజేశ్వర్ ఉన్నారు.

గాంధీనగర్‌లో డ్రైడే

సోన్: గాంధీనగర్ గ్రామంలో సోమవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ జ్వరపీడితులు ఉన్నారా లేదా అని అధికారులు సర్వే నిర్వహించారు. ఇంటి ఆవరణలో నిల్వ నీటిని తొలగించారు. సోన్ పీహెచ్‌సీ వైద్యులు విజయకుమార్, హెచ్ఈఓ సత్యనారాయణ స్వామి, హెల్త్ సూపర్‌వైజర్, పురుషోత్తం హెల్త్ అసిస్టెంట్, రాజమణి, పంచాయతీ కార్యదర్శి సంగీత పాల్గొన్నారు.

పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ డే

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎఫ్ఎల్ఎన్ డే (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమారసీ) నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రమేశ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు అక్షరాల సంఖ్య ఆకారాలు, బోధనోపకరణాలు, చార్టుల రూపంలో తయారు చేసి ప్రదర్శించారని తెలిపారు. అనంతరం పాటలు, కథలు చదివి వినిపించారు. మంగమ్మ రాధాజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సారంగపూర్/ముధోల్: రానున్న రోజుల్లో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్లు శ్రీదేవి, శ్రీలత సూచించారు. మత్స్యకారులు, నదీ పరివాహక ప్రాంతాల్లో పంటపొలాలు ఉన్న రైతులు ఎక్కడికి వెళ్లకుండా ఉండాలని అన్నారు. మత్స్యకారులు చేపల వేటకు స్వర్ణ ప్రాజెక్టులోకి గాని, స్వర్ణ నది పరివాహక ప్రాంతానికివెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

లోకేశ్వరం: ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని లోకేశ్వరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మీనా పేర్కొన్నారు. మండలంలోని ఎడ్దూర్‌లోని శివాలయంలో రాజూరా, మన్మద్, పోట్‌పల్లి గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ పిల్లలకు సోమవారం సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో పిల్లలకు బరువు తగ్గట్టుగా పౌష్టికాహారం అందిస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వీవో సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ మమత ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వారి సమస్యల పరిష్కారానికి రైతునేస్తం కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నిర్మల్ మండలం చిట్యాల రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. పంటల సాగు, పెట్టుబడిపై వచ్చే భారం తగ్గించేందుకు రైతు భరోసా పథకాన్ని సోమవారం నుంచి అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు తక్షణమే అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లాస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, డీఏవో అంజిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద/కుంటాల/దస్తురాబాద్/భైంసారూరల్/తానూరు/సోన్/ఖానాపూర్: లక్ష్మణచాంద, కుంటాల, ఓలా, కల్లూరు, రేవోజీపేట, వానల్‌పాడ్, తానూరు, బెల్‌తరోడా, సోన్, మాదాపూర్ కడ్తాల్, దిలావర్‌పూర్, సత్తనపల్లి, బాదనకుర్తి రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడారు. రైతు నేస్తంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వీసీలో పాల్గొని వారి అన్నదాతల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. తహసీల్దార్లు సరిత, కమల్ సింగ్, విశ్వంబర్, ప్రవీణ్‌కుమార్, సుజాత, ఎంపీడీవోలు లింబాద్రి, సుధాకర్‌రెడ్డి, నసిరొద్దీన్, సునీత, ఏవోలు వినోద్ కుమార్, విక్రమ్, మనీషా, జగదీశ్వర్, ఏఈవోలు, ఆత్మ డైరెక్టర్ రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, డీపీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పాల్గొన్నారు. ఆత్మ డైరెక్టర్ గాండ్ల లింగన్న, రాజన్నయ్య, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, హార్టికల్చర్ అధికారి స్పందన, ఏడీఏ సుజాత పాల్గొన్నారు.

పచ్చదనం పెంచేలా మొక్కలు నాటాలి



కేక్ కట్‌చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, చిత్రంలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో పచ్చదనం పెంచేలా వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వన మహోత్సవంపై జిల్లాస్థాయి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 69,55,268 మొక్కల నాటాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, కార్యాలయాలు, రహదారుల ఇరువైపులా, ఇరిగేషన్ కాలువల వెంట ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలని వివరించారు. ప్రతీ బుధవారం, శుక్రవారం మన ఊరూ – మన పచ్చదనం ఉత్సవం నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా 8,089 ఇళ్లకు ఆమోదం లభించిందని త్వరితగతిన మార్కౌట్ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, డ్రై డే యాక్టివిటీలు నిరంతరం చేపట్టాలన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి

జిల్లా కలెక్టర్‌గా అభిలాష అభినవ్ సోమవారం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారుల సమక్షంలో కలెక్టర్ కేక్ కట్ చేశారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలకు ప్రభావవంతమైన సేవలందించడమే లక్ష్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈతగాళ్లు అందుబాటులో ఉంచాలి



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర: గోదావరి నదిలో నీటమునిగి ఐదుగురు యువకులు మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. గోదావరి నది వద్ద ఆదివారం జరిగిన ప్రమాద స్థలాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఘాట్ల వద్ద 24 గంటలు గజఈతగాళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పడవ నిర్వాహకుల వద్ద లైఫ్ టైం జాకెట్ కిట్లు ఉంటేనే అనుమతి ఇవ్వాలన్నారు. జాకెట్ కిట్లు ఉంటే యువకులు ప్రాణాలతో బతికే వారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



భవ్‌సింగ్ అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసర ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భవ్‌సింగ్ డాక్టరేట్ పొందాడు. ఎలక్ట్రిక్ వెహికల్ అప్లికేషన్ల కోసం ఇండక్టివ్ కపుల్డ్ వైర్లెస్ చార్జింగ్‌పై పరిశోధన చేసినందుకు గాను ఈ డాక్టరేట్ వరించింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అందుకున్నాడు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ జి.సురేష్ బాబు గైడ్‌గా, ప్రొఫెసర్ బి.మంగు సహగైడ్‌గా మార్గనిర్దేశనం చేశారని భవ్‌సింగ్ తెలిపాడు. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

నర్సాపూర్(జి): మండలంలోని పలు గ్రామాల్లో వంగిన స్తంభాలు సరిచేస్తున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ డి.శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్(జి), అంజనీతండా, కుప్టీ, రాంపూర్, నసీరాబాద్, చర్లపల్లి, టెంబరేణీ గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కుంటాల: ఓలా 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మరమ్మతు కారణంగా సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగామ గ్రామాల్లో మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మధు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామంలో సోమవారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతిచెందింది. వ్యవసాయ క్షేత్రంలో ఎద్దు మేత మేస్తుండగా పక్కనే తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు సట్ల నారాయణ తెలిపాడు.

రైతువేదిక ఎదుట బీఆర్ఎస్ ధర్నా

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి రైతువేదిక ఎదుట బీఆర్ఎస్ నేతలు సోమవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన రైతునేస్తం అధికారిక కార్యక్రమానికి అధికారులు, కాంగ్రెస్ నేతలను ఆహ్వానిస్తూ వ్యవసాయ అధికారులు ప్రకటన చేయడంపై నిలదీశారు. సోషల్‌మీడియా గ్రూప్‌ల్లో కాంగ్రెస్ నేతలను ఆహ్వానించి వ్యవసాయ అధికారులు బహిరంగంగానే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎర్వచింతల్ మాజీ సర్పంచ్ గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ శ్రావణ్, సత్తనపల్లి మాజీ ఉపసర్పంచ్ రాజమల్లయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన రమేశ్–ప్రేమల దంపతుల కుమారుడు సాత్విక్ బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండేళ్లుగా ఆసుపత్రుల్లో చికిత్స కోసం రూ.15 లక్షల వరకు ఖర్చుచేశారు. చేతిలో చిల్లీగవ్వ లేకపోవడంతో బాధిత కుటుంబీకులు తమను ఆదుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు సుష్మారెడ్డి దాతల సహకారం కోరగా రూ.54 వేలు రావడంతో సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

విద్యార్థులకు సన్మానం

లోకేశ్వరం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని రాజూర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు యశస్విని, దీపురెడ్డి, జయేనంద్ర, సాయితేజ, అయాన్, సాయిచైతన్యలను సోమవారం వీడీసీ సభ్యులు సన్మానించారు. హెచ్ఎం రాజేశ్వర్, తాజా మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, ఎత్తిపోతల పథకం చెర్మన్ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.